క్లుప్తంగా

ఘనంగా ఆరాధనోత్సవాలు


రథోత్సవంలో బ్రాహ్మణ భక్తులు

ఆదోని అర్బన్: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీ మంగరాయ ఆంజనేయస్వామికి, రాఘవేంద్రస్వాముల వారికి రెండోరోజు బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆధ్వర్యంలో పూజారులు గురురాజా ఆచారి, అక్షయ్‌లు స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, బెంగళూరు నుంచి తెచ్చిన వివిధ రకాల పూలతో అలంకరించారు. అదేవిధంగా రాఘవేంద్రస్వామి ఉత్సవ మూర్తికి అభిషేకాలు, పూల అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో రథోత్సవం నిర్వహించారు. రథం ముందు బ్రాహ్మణ భక్తులు భజనలు చేసుకుంటూ ఆంజనేయ స్వామి ఆలయం చుట్టూ రథోత్సవం కొనసాగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

ఆర్బీకే, సొసైటీలకు ఎరువులు సప్లై చేయండి

కొత్తాళం: ఆర్బీకేలకు, సహకార పరపతి సంఘాలకు ఎరువులు సప్లై చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య డిమాండు చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. అంతేకాక మండలంలో రెండు నెలల క్రితం సాగు చేసిన వివిధ పంటకు ప్రస్తుత వర్షాలతో ఎరువులు అత్యావసరం అయ్యాయని చెప్పారు. దీనికి అసరాగా చేసుకుని ప్రైవేట్ అంగళ్లలో అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తున్నారని అందుకే రైతుల అవసరాల నిమిత్తం ప్రభుత్వం సంఘాలకు, ఆర్బీకేల ద్వారా ఎరువులను పంపిణీ చేయాలని డిమాండు చేశారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


కేవీకేలో మొక్కలు నాటుతున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా. కె. రాఘవేంద్రచౌదరి, వెటర్నరీ కాలేజీ ప్రిన్సిపాల్ డా. గురువిష్ణులు పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమంలో భాగంగా బనవాసి వెటర్నరీ కాలేజీ విద్యార్థులతో మొక్కలు నాటించారు. వారు మాట్లాడుతూ మొక్కలు అంతరించటంతో పర్యావరణం హరించిపోయి కాలుష్యం పెరిగిపోవటం వలన అనేక కొత్త కొత్త వ్యాధుల బారిన ప్రజలు పడి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. నిరంజన్‌రెడ్డి, చందన, మౌనిక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు


గాయాలపాలైన బాలుడు కేశవ్

ఆదోని అర్బన్: మండలంలోని కడితోట గ్రామ సమీపంలో బుధవారం ఆటోను కారు ఢీ కొట్టడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. బాధితుడు వీరేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. పట్టణంలోని మహవీర్ కాలనీకి చెందిన దుర్గమ్మ, మంగమ్మ, వీరేష్, రామంజి బాలుడు కేశవ్ ఉదయం ఉరుకుందకు ఆటోలో వెళ్తున్నారు. కడితోట గ్రామ సమీపంలో అటువైపు నుంచి వచ్చిన కారు ఆటోను ఢీకొట్టడంతో ఐదుగురు గాయపడ్డారు. అందులో మంగమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కేశవ్, మంగమ్మలను కర్నూలుకు రెఫర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలలో చోరీ

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు ప్రాథమిక పాఠశాలలో చోరీ జరిగినట్లు స్కూల్ హెచ్ఎం పాపారాయుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 17న వేకువజామున గ్రామానికి చెందిన చిన్నమూతి నాగరాజు అనే వ్యక్తి పాఠశాల వంట గది తాళాలు పగలగొట్టి అందులోని గ్యాస్ సిలిండర్‌ను ఎత్తికెళ్లుతుండగా స్థానికంగా బహిర్భూమికి వెళ్లిన మహిళలు గుర్తించినట్లు తెలిపారు. గతంలో కూడా రెండు సార్లు సిలిండర్లు అపహరణకు గురయ్యాయన్నారు. ఈ విషయంపై 17వ తేదీన ఎస్ఎంసీ చైర్మన్ హనుమంతు, సర్పంచ్ ఉలిగయ్యలతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని చెప్పారు. ఇప్పటి వరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పోలీసులు విచారణ చేసి నిందితుడిని అదుపులో తీసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు.

ముంచేసిన వాన

- భారీ వర్షాలకు నీట మునిగిన పంట పొలాలు
- పొలాల్లో ఇసుక మేటలు
- చేలలో నిలిచిన వరద నీరు
- బురదమయంగా మారిన పొలాల్లో రైతన్న అవస్థలు
- తీవ్రంగా నష్టపోయిన అన్నదాత


పూర్తిగా నీటి మునిగిన పంట


బురద కప్పేసిన మిరప పైరు

కొత్తాళం: నెల రోజుల నుంచి వర్షాలు లేక ఎండుతున్న పంటలకు వారం క్రితం కురిసిన వర్షం ప్రాణం పోసినట్లు అయ్యిందని రైతన్నలు ఆనందించారు. అయితే మంగళవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షం వారి ఆనందాన్ని హరించివేసింది. వర్షం ధాటికి వాగులు, వంకలు పొంగిపొర్లి పంటపొలాలను ముంచెత్తాయి. దీంతో అన్నదాతలకు భారీ నష్టం వాటిల్లింది. బుధవారం వరకు కూడా వరద నీరు పొలాల్లోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొలాల్లోనే వరద నీరు..

ప్రధానంగా మండలంలోని కొత్తాళం, బదినేహాల్, ఉప్పరహాల్, నదిచాగి, కుంటనహాల్ గ్రామాల్లో వంకలు, వాగులు పక్కన సాగుచేసిన మిరప, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు రైతన్నల కళ్లముందే వరద తాకిడికి పంట పూర్తిగా కొట్టుకుని పోయాయి. కొన్ని పొలాల్లో వరద నీరు ఇంకా నిలబడి ఉండగా కొన్ని చోట్ల ఇసుక మెట వేసింది. పైర్లను ఇసుక, బురద కప్పేసింది. నిల్వ ఉన్న నీటితో పైర్లు కుళ్లిపోయి చీడపీడలు ఆశించే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

1550 ఎకరాల్లో పంట నష్టం

మండలంలో మంగళవారం వచ్చిన బారీ వర్షం వల్ల వంకలు, వాగులు పక్కన ఉన్న పంట పొలాల్లో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయని దానికి ప్రాథమిక అంచన వేసినట్లు మండల వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. అధికంగా మిరప, పత్తి పంట దెబ్బతిన్నట్లు ఆయన తెలిపారు. ప్రాథమికంగా 1,550 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అంచనా వేసినట్లు వెల్లడించారు.

ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి



ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి. రెండు ఎకరాల్లో సాగుచేసిన మిరప పంట పూర్తి దెబ్బతింది. పొలం అంతా బురదమయంగా మారింది. వంక పక్కన ఉన్న బురద అంతా పొలంలో కొట్టుకుని రావడంతో 80 శాతం పంట బురదతో కప్పి వేయబడింది. అధికారులు నష్టం అంచనా వేసి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునేలా చూడాలి. – రాజసాబ్, కొత్తాళం

పొలం అంతా ఇసుకే



ఉన్నరెండు ఎకరాలు పొలం అంతా ఇసుకతో నిండిపోయింది. ఒక్కసారి వచ్చిన వరద నీటి కారణంగా వంక పక్కన ఉన్న పొలం అంత ఇసుక మేట వేసింది. ఇప్పటికే ఎకరాకు కనీసం రూ.20వేల వరకు ఖర్చు చేశాను. ఇక పంట రాదు. ప్రభుత్వం స్పందించి తమలాంటి రైతులకు ఆదుకోవాలి. అప్పుడే మాకు న్యాయం జరుగుతుంది.

– చాకలి నర్సింహ, ఉప్పరహాల్ గ్రామం

ఇంకా నీటిలోనే పంట



వర్షం వచ్చి రెండు రోజులయినా ఇంకా పంట అంత నీటిలోనే ఉంది. పొలంలో ఇంక రెండు అడుగుల నీరు ఉంది. నీరు ఎప్పుడు తగ్గుతుందో, తమకు పంట ఎప్పుడు కనబడుతుందో అని ఆందోళనగా ఉంది. నాకు ఉన్న ఎకరాతో పాటు మరో ఎకరా కౌలుకు తీసుకుని రెండు ఎకరాల్లో మిరప పంటను సాగుచేశా. ఇప్పటికే ఎకరాకు కనీసం రూ.40వేలకు పైగ పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వం ఆదుకోక పోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం. ప్రభుత్వం ఈ విషయంలో తక్షణమే ఆలోచించాలి.

– పింజారి యాలీ చిన్న ఖాదర్‌బాషా

నందవరం ఎస్ఐగా శ్రీనివాసులు


ఎస్ఐ వి.శ్రీనివాసులు

నందవరం : నందవరం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా వి. శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ తిమ్మయ్యను ఉన్నాతాధికారులు గుడూరు పోలీస్ స్టేషన్ బదిలీ చేశారు. దీంతో అనంతపురం జిల్లా బొమ్మనహళ్లి పోలీస్‌స్టేషన్ నుంచి శ్రీనివాసులు ఇక్కడికి బదిలీపై వచ్చారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎల్‌బీ స్ట్రీట్ కాలనీకి చెందిన నరసింహులుపై బుధవారం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ రామలింగప్ప తెలిపారు. త్రీటౌన్ పరిధిలోని ఓ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి జూన్ నెల 29న హైదరాబాద్‌కు తీసుకెళ్లి పెళ్లి చేసుకుని శారీరకంగా, మానసికంగా అనుభవించాడని తెలిపారు. ఆ తరువాత ఆదోనికి తిరిగి వచ్చి ఎవరికి వారు ఇళ్లల్లో ఉండిపోయారన్నారు. మరలా ఆగస్టు 1న అమ్మాయి ఇంటికి వెళ్లి తన దగ్గర ఉన్న ఫోటోలన్నీ చూపి బ్లాక్‌మెయిల్ చేసి చేయి పట్టుకున్నాడన్నారు. వెంటనే బాలిక తల్లి చూడడంతో ఆ యువకుడు పారిపోయాడని, తల్లిదండ్రులు త్రీటౌన్ పోలీస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ యువకుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.

సబ్‌కలెక్టర్‌కు ఘన వీడ్కోలు


శివనారాయణశర్మను సన్మానిస్తున్న జేసీ బి.నవ్య, ఉద్యోగులు

ఆదోని రూరల్: అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మకు అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సి.విశ్వనాథ, రెవెన్యూ కార్యాలయపు అధికారులు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. శివనారాయణశర్మను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ మాట్లాడుతూ ఐఏఎస్ హోదాలో మొదటి పోస్టింగ్ ఆదోని సబ్‌కలెక్టర్‌గా రావడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా ఎన్నికల విధుల్లో కార్యాలయపు సిబ్బంది సహకారాన్ని మరువలేనన్నారు. అనంతరం కార్యాలయపు సిబ్బంది వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్యతో కలిసి కార్యాలయం పరిసరాలను, రికార్డు రూమ్, గదులను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి కె.వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, తహసీల్దార్ శివరాముడు, డిప్యూటీ తహసీల్దార్లు రుద్రగౌడ్, రామేశ్వర్‌రెడ్డి, వలీబాషా, దీపా, వినీత్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ


తెల్లబండ్ల రాఘన్న (ఫైల్)


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

మంత్రాలయం : మంత్రాలయం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య తండ్రి తెల్లబండ్ల రాఘన్న (66) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమారెడ్డి రాఘన్న భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ భీమయ్య, ప్రాణేష్‌లకు పరమార్శించి ధైర్యంగా ఉండాలని, మేమంతా అండగా ఉంటామంటూ భరోసాను కల్పించారు. టీటీడీ పాలక మండల సభ్యుడు వై. సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు వై. ప్రదీప్ రెడ్డి, వై.ధరణీధర్ రెడ్డిలు ఫోన్ చేసి సంతాపం తెలిపారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో నీటి మళ్లింపు పనులు


భూగేని చెరువు వద్ద పనులు చేయిస్తున్న ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని భూగేని చెరువు సమీపంలో కొండ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీటిని మళ్లించేందుకు ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి సొంత నిధులతో పనులు చేయిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల నాయకులు, ఎంపీపీ ఈరన్న, కాంట్రాక్టర్ బసిరెడ్డి, ఉరుకుంద ట్రస్ట్‌బోర్డుమెంబర్ బుళ్లి నరసింహులు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రత్యేకంగా జేసీబీని ఏర్పాటు చేసి నీటి మళ్లింపు పనులు చేపట్టారు. వారు మాట్లాడుతూ మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి భూగేని చెరువు సమీపంలో వాగులు, వంకలు పొంగి పొర్లి పొలాల్లోకి నీళ్లు చేరుకుని రైతులను ఇబ్బందులకు గురిచేశాయి. రైతుల ఇబ్బందులను గుర్తించిన వైఎస్సార్‌సీపీ నాయకులు పై భాగంలోని తిమ్మప్ప కొండ, బసవన్న కొండల నుంచి భారీగా వచ్చే వర్షపు నీటిని వెళ్లకుండా అడ్డుగా ఉన్న ముళ్లపొదలు, కాల్వలో పూడిక తీత పనులు దగ్గరుండి చేయించారు. అలాగే చింతకుంట రోడ్డులోని రంగప్ప గట్టు నుంచి వచ్చే నీటిని కూడా వంకలో వెళ్లేల పనులు చేపట్టారు. రైతుల సంక్షేమం కోసం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఎళ్లవేళల అండగా ఉంటారన్నారు. వైఎస్సార్ సీపీ జంపాపురం, తుంబిగనూరు సర్పంచ్‌లు హారోన్, వారం ఈరన్న, తదితరులు ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ట్రైనీ డీఎస్పీ ధీరజ్

ఆదోని రూరల్: పట్టణ శివారులోని బైచిగేరి గ్రామ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ట్రైనీ డీఎస్పీ ధీరజ్ తెలిపారు. ఈ మేరకు నిందితుల వివరాలను స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. పట్టణంలోని బాలాజీ పేటకు చెందిన బోయ సరోజ, బోయ ఈరమ్మ, బోయ లక్ష్మి, బోయ మానస, బోయ హనుమంతమ్మ బ్యాగుల్లో అక్రమంగా రూ.30 వేలు విలువ చేసే 688 టెట్రా ప్యాకెట్లను తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో రూరల్ సీఐ నల్లప్ప, ఎస్ఐలు రామాంజనేయులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎమ్మిగనూరుటౌన్: కోల్‌కతాలోని మెడికల్ కలేజీలోని పీజీ వైద్య విద్యార్థిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాయకులు గోవిందు, రాముడు, అంగన్వాడీ వర్కర్స్ యునియన్ నాయకులు గోవర్ధనమ్మ, నాగలక్ష్మిలు డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు సమగ్ర మహిళా చట్టాలను అమలు చేయాలన్నారు. బుధవారం సోమప్ప సర్కిల్‌లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

నందవరం : మండల పరిధిలోని ముగతి గ్రామంలో పీడీఎస్ఓ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులతో సర్కిల్ మానవహారం చేపట్టి ధర్నా నిర్వహించారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు అర్జున్, ఇమ్రాన్, నాయకులు పాల్గొన్నారు.

వర్షం కోసం తుంగాజలంతో పూజలు


తుంగాజలాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న రైతులు, గ్రామస్తులు

గోనెగండ్ల : వరుణదేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురిపించాలని మండల కేంద్రం గోనెగండ్లకు చెందిన రైతులు, ప్రజలు తుంగాజలంతో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం రైతులు తుంగభద్ర నదికి పాదయాత్రగా నదీ జలాలను తీసుకురాగా సాయంత్రం వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో ఊరేగింపుగా వెళ్లి గ్రామంలో ఉన్న దేవతామూర్తులకు జలాభిషేకాలు, విశిష్ట పూజలు చేశారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలి

ఎమ్మిగనూరు: విద్యాసంస్థలకు సెలవులు, బంద్‌లు ఉన్నరోజుల్లో కూడా బోధనేతర సిబ్బందిని నిర్బంధించి పనులు చేయించుకుంటున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ జిల్లా నాయకులు చాంద్‌బాషా, ఎర్రన్న డిమాండ్ చేశారు.బధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని నారాయణ, చైతన్య, భాష్యం, లిటిల్‌ఫ్లవర్ ప్రవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు సెలవులు ప్రకటించి బోధన, బోధనేతర సిబ్బందికి సెలవులు ఇవ్వకపోవడం హక్కులను కాలరాయడమేనన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాఘవేంద్ర, అఫ్జల్, సిద్దరాముడు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి బాలిడి ఆత్మహత్య

ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్ పరిధిలోని ఆస్పరి మండలం చిగలి గ్రామానికి చెందిన వడ్డే ఈరన్న కుమారుడు వడ్డే వీరేంద్ర (16) గురువారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి మానసిక స్థితి సరిగా లేక నగరూర్–ఆస్పరి ఆర్ఎస్ మధ్యలో అప్‌లైన్ ట్రాక్ వద్ద రైలు నంబర్. 16594 కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ గోపాల్, హెడ్‌కానిస్టేబుల్ సర్వేశ్వరరావు తెలిపారు. మృతుడికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించినట్లు వారు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

వ్యవసాయ కూలీలు, కార్మికులను ఆదుకోవాలి

నందవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీలు, కార్మికులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని నాగలదిన్నె గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నదీ తీర ప్రాంతాలలోని ప్రజలు, వ్యాపారులు 2009లో భారీ వరద కారణంగా అప్పుల ఊబిలో కూరకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వారి ఆర్థికాభివృద్ధి సహకారించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అబ్దుల్‌గఫూర్, మన్సూర్, భీమన్న, శ్రీను, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటుతో పేదలకు ప్రాథమిక విద్య దూరం

ఆదోని సెంట్రల్: సర్దుబాటు పేరుతో ప్రాథమిక పాఠశాలలో ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను సబ్జెక్టు పేరుతో ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయడం వలన ప్రాథమిక విద్యను పేద పిల్లలకు దూరం చేసిన వారవుతామని ఎస్టీయూ రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులు మహాదేవప్ప అన్నారు. బుధవారం ఎస్టీయూ భవనంలో సంఘం మండల అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలలకే సర్దుబాటు చేస్తే సమంజసంగా ఉంటుందన్నారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, నాయకులు గోపాల్, రామాంజినేయులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు


డ్రైనేజీలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని డ్రైనేజీల్లో చెత్తాచెదారాన్ని వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌తో పాటు సోగనూరు రోడ్డు, షరాఫ్ బజార్ ఏరియాల్లోని డ్రైనేజీల్లో పూడిక తీత పనులను పరిశీలించారు. పట్టణ వాసులు పారిశుద్య సిబ్బందికి పొడి, తడి చెత్త ఇవ్వాలని అలాకాకుండా మురుగుకాలువల్లో పారబోస్తే నీటి పారుదలకు ఆటంకం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ ఏఈలు శరత్‌చంద్ర, మదన్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం

ఆదోని అర్బన్: పట్టణంలోని జీవనజ్యోతి వృద్ధాశ్రమంలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. క్లబ్ జిల్లా చైర్మన్లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు, పట్టణ అధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా, సభ్యులు వనపరాజు వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు, కేకులను అందించారు. ఆశ్రమం ఇన్‌చార్జ్ ఫిలిప్స్, వీరేష జంపన్న, హనుమంతమ్మ, రామయ్య పాల్గొన్నారు.

యార్డులో సౌకర్యాలకు ప్రతిపాదనలు పంపండి


మార్కెట్‌యార్డు అధికారులతో చర్చిస్తున్న మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ విజయసునీత

ఆదోని అర్బన్: యార్డులో సమస్యలు లేకుండా, రైతులు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించేందుకు త్వరగా ప్రతిపాదనలు పంపితే నిధులు కేటాయిస్తామని మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ విజయసునీత యార్డు అధికారులకు సూచించారు. గత వారంలో తేలికపాటి వర్షానికి రైతులు తెచ్చిన వేరుశనగ దిగుబడులు కొట్టుకుపోయిన విషయంపై ఆమె బుధవారం ఆదోని మార్కెట్‌యార్డును సందర్శించారు. యార్డులోని డ్రైనేజీలను, ప్లాట్‌ఫాంలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ యార్డులో అదనపు మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీల నిర్మాణం, శుభ్రత, రైతులకు విశ్రాంతి భవనం, తాగునీటి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్టోబర్‌లో ప్రారంభమయ్యే సీజన్ కల్లా ఈ సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యార్డులో ప్రతి దుకాణానికి విద్యుత్ మీటర్లు బిగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మిర్చి కోల్డ్ స్టోరేజీకి తాము స్థలం కేటాయిస్తామని, దాతలు నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రావాలని కోరారు. జేడీ రామాంజనేయులు, డీడీఎం శ్రీకాంత్‌రెడ్డి, ఏడీఎం సత్యనారాయణమూర్తి, సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ పాల్గొన్నారు.

వరద సమయంలో హంద్రీలోకి వెళ్లొద్దు


జీడీపీ నీటిని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

గోనెగండ్ల : వరదల సమయంలో జీడీపీ ఎగువ ప్రాంతం, హంద్రీలోకి ఎవరూ వెళ్లారాదని ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. గాజులదిన్నె ప్రాజెక్టును బుధవారం పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను జీడీపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు వివరాలను ప్రాజెక్టు డీఈ విజయ్ కుమార్ ఎస్పీకి వివరించారు. అలాగే గంజిహళ్లి, ఐరన్‌బండ గ్రామాలకు చెందిన రైతులు, కూలీలు వరద నీటిలో చిక్కుకున్న ఘటనపై ఎస్పీ ఆరా తీశారు. వరద నీటిలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు పోలీసులు, మండల పరిషత్, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించడంతోనే రెండు గ్రామాల రైతులు, కూలీలు మొత్తం 33 మంది, ఎద్దులు, పొట్టేళ్లు క్షేమంగా బయట పడ్డాయని ఎస్పీకి వివరించారు. భారీ వర్షాలు కురిసి వరదలు వచ్చే సమయంలో ప్రజలు పోలీసులకు సమాచారం అందజేస్తే ముందస్తు చర్యలు తీసుకుంటారని ఎస్పీ తెలిపారు. మంగళవారం రాత్రి వరద నీటిలో చిక్కుకున్న రైతులను రక్షించడంలో కృషి చేసిన కానిస్టేబుల్ బ్రహ్మయ్యను, మత్స్యకారులు, బోటు, తెప్పనడిపే వారిని ఎస్పీ అభినందించారు. అనంతరం ఐరన్‌బండ గ్రామానికి వెళ్లి అక్కడ ప్రజలతో మాట్లాడారు. వరదల సమయంలో నదిలోకి వెళ్లొద్దని సూచించారు. అలాగే గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఏఈ మహమ్మద్ అలీ, సిబ్బంది ఉన్నారు.

ప్రతి విద్యార్థి దేశం కోసం పాటుపడాలి


బహుమతులు అందుకున్న విద్యార్థులతో దాత వెంకటరెడ్డి

పెద్దకడబూరు : ప్రతి విద్యార్థి చదువుతో పాటు దేశం కోసం పాటుపడాలని స్వాతంత్ర్య సమర యోధుడు దివంగత వెంకటరెడ్డి మనవడు వెంకటరెడ్డి అన్నాడు. స్వాతంత్ర్య సమరయోధుడు వెంకటరెడ్డి 114వ జయంతి సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఉమారాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 2023 – 24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 560 మార్కులు సాధించిన దివాకర్‌కు రూ. 5016లు, వీరాంజినేయులు (528 మార్కులు)కు రూ.3016లు, రాఘవేంద్ర (508)కు రూ. 2016ల చెక్కులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఆర్ ఎంజీ రెడ్డి విద్యార్థులకు ధ్యానము, విద్యా, నైతిక విలువలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ స్వామిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు సద్వినియోగం చేసుకోవాలి


ట్యాబ్ బేస్డ్ అసైన్‌మెంట్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ

పెద్దకడబూరు : విద్యార్థులు ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లను సక్రమ మార్గంలో ఉపయోగించుకోవాలని డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ ట్యాబ్ బేస్డ్ అసైన్‌మెంట్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లలో వ్యర్థ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోరాదన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమా రాజేశ్వరమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.